తాంసిలో ఆధార్ కేంద్రం ప్రారంభం

తాంసి, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో నూతనంగా సోమవారం ఆధార్ కేంద్రాన్ని ప్రారంభించారు. సర్వ శిక్ష అభియాన్ ఆధ్వర్యంలో ఈ కేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు సంబంధిత ఆధార్ నిర్వాహకుడు అరుణ్ పేర్కొన్నారు. మూడు రోజుల పాటు ఈ కేంద్రం మండల కేంద్రంలో ఉంటుందని, ఎవరైనా ఆధార్ కార్డులో తప్పులు ఉంటే, అలాగే మార్పులు, చేర్పులు చేసుకోవచ్చని పేర్కొన్నారు. తప్పనిసరిగా ఏదైనా గుర్తింపు ఉండాలని, ఈ విషయాన్ని గుర్తించాలని కోరారు. ఈ కేంద్రాన్ని స్థానిక ప్రాథమిక పాఠశాలలో ఏర్పాటు చేయడం జరిగిందని పేర్కొన్నారు.



● జిల్లా కేంద్రంలోని సీసీఐ పరిశ్రమ

'సీసీఐ' కథ.. ముగిసినట్లే!

- జిల్లాలో సిమెంట్ పరిశ్రమ స్ర్కాప్ టెండర్లకు రంగం సిద్ధం
- ఈనెల 7న టెండర్‌ల ఓపెన్‌కు అధికారుల కసరత్తు
- పెండింగ్ వేతనాల కోసం హైకోర్టును ఆశ్రయించిన కార్మికులు
- పునరుద్ధరణ సాధ్యపడదంటూ ముందే చెప్పిన 'ఆంధ్రజ్యోతి'
- ఆందోళనలో కార్మిక కుటుంబాలు.. మండిపడుతున్న ప్రతిపక్షాలు
- జిల్లాకేంద్రంలో 772 ఎకరాల విస్తీర్ణం కలిగి ఉన్న సీసీఐ పరిశ్రమ

ఆదిలాబాద్, మార్చి 3(ఆంధ్రజ్యోతి): గత 27 ఏళ్ల క్రితం మూతబడిన ఆదిలాబాద్ సిమెంట్ పరిశ్రమ స్ర్కాప్‌ను విక్రయించేందుకు సీసీఐ సంస్థ రంగంసిద్ధం చేసింది. ఇప్పటికే టెండర్ ప్రక్రియను ప్రారంభించింది. దీంతో ఇక సీసీఐ పరిశ్రమ కథ ముగిసినట్లేనన్న వాదనలు వినిపిస్తున్నాయి. దశాబ్దాలుగా పరిశ్రమను పునరుద్ధరించేందుకు చేసిన ప్రయత్నాలన్నీ వృధాగానే మారాయి. అయితే ఈ పరిశ్రమను పునరుద్ధరించడం సాధ్యపడదంటూ గతంలోనే కేంద్ర ప్రభుత్వం తేల్చి చెప్పింది. దేశవ్యాప్తంగా సీసీఐ ఆధ్వర్యంలో 11 సిమెంట్ పరిశ్రమలు ఉన్నాయి. ఇందులో 7 పరిశ్రమలు ఇప్పటికే మూతపడ్డాయి. మిగితా తాండూరు(ఏపీ), బోకాజన్ (అస్సాం), రాజ్‌భన్ (హిమాచల్) పరిశ్రమలు నష్టాల్లోనె నెట్టుకొస్తున్నాయి. గతం లో సిమెంట్ పరిశ్రమల పునరుద్ధరణపై కేంద్ర ప్రభుత్వానికి ఒక నివేదికను సమర్పించినా.. దానిని తేలికగానే తీసుకున్నట్లు తెలుస్తుంది. అప్పటి నుంచి పరిశ్రమ పునరుద్ధరణ కోసం కార్మికులు డిమాండ్ చేస్తునే ఉన్నారు. చివరకు పరిశ్రమలోని భారీ యంత్ర సామగ్రి, ఇతర ఆస్తులను వేలం వేసేందుకు సీసీఐ నిర్ణయించడంతో సర్వత్రా ఆందోళన వ్యక్తమవుతోంది. జిల్లా కేంద్రంలో 772 ఎకరాల విస్తీర్ణం కలిగి ఉన్న సీసీఐ పరిశ్రమ 170 ఎకరాల టౌన్ షిప్, 1500 ఎకరాలలో సుమారు 48 మిలియన్ టన్నుల లైమ్‌స్టోన్ నిల్వలను కలిగి ఉంది. గత కొన్నాళ్ల క్రితమే రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్‌బాబు, ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల శంకర్‌తో కలిసి సీసీఐ పరిశ్రమను సందర్శించారు. పరిశ్రమ పునరుద్ధరణకు అవసరమైన చర్యలను తీసుకుంటామని ప్రకటించారు. అయితే ఊహించని విధంగా సీసీఐ స్ర్కాప్ టెండర్లను పిలవడంతో పరిశ్రమ పునరుద్ధరణపై ఆశలు ఆవిరవుతున్నాయి. అయితే సీసీఐ పరిశ్రమ పునరుద్ధరణ సాధ్యపడదంటూ 'ఆంధ్రజ్యోతి' ముందే చెప్పిన విధంగా సీసీఐ స్ర్కాప్ టెండర్లను చర్చనీయాంశంగా మారింది. దీంతో కేంద్ర ప్రభుత్వంపై కాంగ్రెస్, బీఆర్‌ఎస్ నేతలు మండిపడుతున్నారు. టెండర్లను నిలిపి వేయకుంటే ఆందోళనలు చేపడతామని హెచ్చరిస్తున్నారు.



సీసీఐపై 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన కథనం(ఫైల్)

రూ.900 కోట్ల ఆస్తులు

సిమెంట్ పరిశ్రమ ఆస్తుల విలువ దాదాపుగా రూ.900 కోట్ల వరకు ఉంటుందని సీసీఐ అధికారులు నిర్ధారించారు. గతంలోనే మూతబడిన పరిశ్రమలతో పాటు జిల్లాలోని సీసీఐ పరిశ్రమ ఆస్తులను కూడా వేలం వేసేందుకు సీసీఐ రంగం సిద్ధం చేసింది. అయితే కొందరు కార్మిక సంఘాల నేతలు కోర్టును ఆశ్రయించడంతో ఆస్తుల వేలం ప్రక్రియ వాయిదా పడింది. మళ్లీ తాజాగా టెండర్లను పిలవడం చర్చనీయాంశంగా మారింది. సీసీఐ పరిశ్రమ భారీ యంత్రాలు, భవనాలు, ఇతర సామగ్రి పూర్తిగా శిథిలమై, తుప్పుపట్టి పోవడంతోనే పునరుద్ధరణ సాధ్యపడదంటూ భావించిన కేంద్రం.. స్ర్కాప్ టెండర్లను నిర్వహిస్తున్నట్లు తెలుస్తుంది. అయితే ప్రారంభపు టెండర్ ధరను రూ.43 కోట్ల 30లక్షలుగా నిర్ణయించింది. ఈఎండీగా రూ.కోటీ 92లక్షలను చెల్లించాలన్న నిబంధన విధించింది. ఈనెల 7న టెండర్‌లను తెరిచేందుకు అధికారులు కసరత్తు చేస్తున్నారు. ఉదయం 11గంటలకు టెండర్ ప్రక్రియను ప్రారంభించి మధ్యాహ్నం 3 గంటల 30 నిమిషాల వరకు పూర్తి

(తరువాయి 6వ పేజీలో...)

మళ్లీ కోర్టును ఆశ్రయిస్తాం

: ఎస్.విలాస్, ఏఐటీయూసీ జాతీయ సమితి సభ్యులు



సీసీఐ పరిశ్రమ పునరుద్ధరణ, కార్మికుల బకాయి వేతనాలపై మళ్లీ కోర్టును ఆశ్రయిస్తాం. కోర్టు ఆదేశాలకు వ్యతిరేకంగా సీసీఐ మొండిగా వ్యవహరిస్తోంది. గతంలో కేంద్ర ప్రభుత్వం పెద్దలు పరిశ్రమ పునరుద్ధరణపై స్పష్టమైన హామీ ఇచ్చారు. కార్మికులకు రావాల్సిన బకాయిలు వెంటనే చెల్లించాలి. బీజేపీ ఎంపీ, ఎమ్మెల్యేలు కేంద్రంపై ఒత్తిడి తీసుకు రావాలి. ఏకంగా ప్రధాని నరేంద్రమోదీ జిల్లాకు వచ్చి పోయినా పునరుద్ధరణపై అతీగతి లేకుండానే పోయింది. కేంద్ర ప్రభుత్వం సీసీఐని పునరుద్ధరించక పోయినా.. రాష్ట్ర ప్రభుత్వానికి బదిలీ చేసి ఉంటే బాగుండేది.



● పరిశ్రమలో తుప్పుపట్టి కనిపిస్తున్న భారీ వాహనాలు

అర్జీలను సత్వరమే పరిష్కరించాలి

● అదనపు కలెక్టర్ శ్యామల దేవి

ఆదిలాబాద్ రూరల్, మార్చి 03 (ఆంధ్రజ్యోతి) : ప్రజావాణిలో వచ్చే అర్జీలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని అదనపు కలెక్టర్ శ్యామలదేవి అన్నారు. సోమవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణిలో ఆమె పాల్గొని ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. సమస్యలను విన్న తర్వాత వాటి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని సంబంధిత శాఖ అధికారులకు అందించారు. కాగా ప్రజావాణిలో వివిధ శాఖలకు సంబంధించి 64 అర్జీలు వచ్చాయని తెలిపారు. అర్జీలను పెండింగ్‌లో పెట్టకుండా అధికారులు వాటిని పరిశీలించి ఎప్పటికప్పుడు పరిష్కరించాలని అధికారులకు సూచించారు. నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

స్థలం కబ్జా చేసిన వారిపై చర్యలు తీసుకోండి..

ప్రభుత్వ స్థలాన్ని కబ్జా చేసి అక్రమ మదర్సా కట్టిన వారిపై చర్యలు తీసుకోవాలని హిందు వాహిని ఆదిలాబాద్ శాఖ నాయకులు పేర్కొన్నారు. సోమవారం ప్రజావాణిలో విన్నవించారు. తాటిగూడ కాలనీలోని వార్డ్ నెంబర్.23లో ప్రభుత్వ స్థలంలో కొందరు వ్యక్తులు ఎలాంటి అనుమతులు తీసుకోకుండా దారుల్ ఉలూమ్ మదర్సా అర్ధరాత్రి సమయంలో కట్టుకున్నారని ఆరోపించారు. స్థలం పక్కనే నాల ఉన్నదని నాలకు సంబంధించిన స్థలం కబ్జా అయిందన్నారు. వినతిపత్రం అందజేసిన వారిలో రాళ్ల బండి మహేందర్, గంద్రత్ మహేందర్, కందుల నాణక్య, ఎల్చల నవనీత్ ఉన్నారు.



వినతి పత్రం అందజేస్తున్న హిందువాహిని నాయకులు

ఆదిలాబాద్ ప్రజావాణిలో ఐసీడీఎస్ పీడీకి స్వల్ప అస్వస్థత..

ఆదిలాబాద్ కలెక్టరేట్ నిర్వహించిన ప్రజావాణికి హాజరైన మహిళా శిశు సంక్షేమ శాఖ ప్రాజెక్ట్ డైరెక్టర్ సబితా ఉన్నట్లుండి స్వల్ప అస్వస్థతకు గురయ్యారు. ఒక్కసారిగా చెమటలు పట్టి నోటి మాట రాకపోవడంతో అందరూ హైరానా పడ్డారు. అక్కడే ఉన్న అదనపు కలెక్టర్ శ్యామలాదేవి, అధికారులు పరామర్శించి కుటుంబసభ్యులు మాట్లాడగా.. రోజువారీ మాత్రలు వేసుకోకపోవడం వలన అలా జరిగి ఉంటుందని చెప్పుకొచ్చారు. అనంతరం ఆమెను ఇంటికి పంపించారు.

బండరాళ్ల లారీలను రిలీజ్ చేయాలని వినతి

లారీలను విడుదల చేయాలని ఆదిలాబాద్ పట్టణంలోని పిట్టల వాడకు చెందిన వారు కోరారు. గుడిహత్నూర్‌కు చెందిన వారికి వ్యవసాయ భూమిని చదును చేయడానికి ఒప్పందం కుదుర్చుకున్నామన్నారు. పొలంలో బండరాళ్ల భూ యజమాని అనుమతితో లారీలో నింపుతుండగా రెవెన్యూ అధికారులు వచ్చి లారీను మైనింగ్ అధికారులకు అప్పజెప్పారన్నారు. తాము తప్పుడు పనులు చేయలేదని, బండరాళ్లను కొట్టుకుంటూ జీవనం గడుపుతున్నామని, సమస్యను పరిష్కరించాలని కోరారు.

కష్టపడి పనిచేసిన వారికే గుర్తింపు

● రాష్ట్ర మంత్రి సీతక్క



మంత్రి సీతక్కకు పూలమొక్కను అందజేస్తున్న కందిశ్రీనివాస్‌రెడ్డి

ఆదిలాబాద్, మార్చి 3(ఆంధ్రజ్యోతి): పార్టీలో కష్టపడి పనిచేసిన వారిని తప్పకుండా గుర్తించి వారికి తగిన గౌరవం ఇస్తామని రాష్ట్ర మంత్రి సీతక్క అన్నారు. సోమవారం మహారాష్ట్రలోని వార్ధాసేవాగ్రామ్‌కు వెళ్లి తిరుగు ప్రయాణంలో జిల్లా కేంద్రంలోని ప్రజాసేవ భవన్ క్యాంపు కార్యాలయాన్ని మంత్రి సందర్శించారు. ఈ సందర్భంగా మంత్రికి కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ నియోజక వర్గ ఇన్‌చార్జికంది శ్రీనివాస్‌రెడ్డి పార్టీ శ్రేణులతో కలిసి ఘన స్వాగతం పలికారు. అనంతరం మంత్రి సీతక్క మాట్లాడుతూ ఇటీవల కాలంలో జరిగిన అన్ని ఎన్నికల్లో పార్టీ గెలుపు కోసం కష్టపడి పని చేసిన వారందరిని గుర్తు పెట్టుకుంటామన్నారు. ఇందులో ఆత్రంసుగుణ, శ్రీలేఖ ఆదివాసీ, ఉయిక ఇందిరా, బూర్ల శంకరయ్య, సింగిరెడ్డి రామ్ రెడ్డి, మోరఆశన్న, డేరా కృష్ణారెడ్డి, గడ్డం అఖిల్‌రెడ్డి, గిజ్జనర్సింగ్, అఫ్రోజ్ అహ్మద్, అశోక్, అజీజ్ తదితరులు పాల్గొన్నారు.

కరాటే పోటీల్లో విద్యార్థుల ప్రతిభ



పథకాలు సాధించిన విద్యార్థులతో ఉపాధ్యాయులు

నేరడిగొండ, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): ఇంటర్ అంతర్ రాష్ట్రీయ స్టేట్ ఓపెన్ కరాటే పోటీల్లో (టీజీ టీడబ్ల్యూయూఆర్‌జేసీ) బుగ్గరాం బాలికల రెసిడెన్షియల్ విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. వివిధ విభాగాల్లో పథకాలు సాధించారని ప్రిన్సిపాల్ కృష్ణవేణి అన్నారు. ఈనెల 2న మంచిర్యాలలో జరిగిన ఇంటర్ అంతరాష్ట్రీయ పోటీల్లో టీజీ టీడబ్ల్యూయూఆర్‌జేసీ నుంచి 21 మంది విద్యార్థినిలు బంగారు పథకాలు సాధించారన్నారు. 11 బంగారు పతకాలు, 6 వెండి పతకాలు, నాలుగు కాంస్య పతకాలు సాధించారన్నారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థినీలను ప్రిన్సిపాల్‌తో పాటు ఉపాధ్యాయ బృందం అభినందించారు.

జాతీయస్థాయిలో సత్తాచాటిన వేదం విద్యార్థులు

బోథ్ : మండల కేంద్రానికి చెందిన వేదం పాఠశాల విద్యార్థులు కరాటేపోటీల్లో మూడోనేషనల్ ఇన్విటేషన్ కరాటే చాంపియన్‌షిప్ వారు ఈ ఏడాది నిర్వహించిన కరాటేపోటీల్లో వేదం పాఠశాలకు చెందిన విద్యార్థులు తమ సత్తాచాటి వెండి బ్రాంజ్ మెడల్ సాధించారు. జోహర్, హరిణి, సహస్ర, మేఘన, అభిలాష్, సాయివర్ధన్, శ్రీమాన్ సిల్వర్ సాధించగా చరణ్ బ్రాంజ్ సాధించారు. విద్యార్థులు ప్రతిభకనబరిచి పాఠశాల పేరు నిలపెట్టడం పట్ల ప్రిన్సిపాల్ సంతోష్ హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా కరాటే మాస్టర్ రాజేశ్వర్ అభినందించారు.

డీపీవో ఉద్యోగనియామక ప్రొవిజనల్ జాబితా విడుదల

ఆదిలాబాద్ రూరల్, మార్చి 03 (ఆంధ్రజ్యోతి) : జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఎన్‌హెచ్‌ఎంలో జిల్లా ప్రోగ్రామ్ అధికారి దరఖాస్తులు చేసుకున్న అభ్యర్థుల ప్రొవిజనల్ జాబితాను విడుదల చేసినట్లు డీఎంహెచ్‌ఓ రాథోడ్ నరేందర్ ఒక ప్రకటనలో తెలిపారు. జాబితాను కార్యాలయ వెబ్‌సైట్ ఆదిలాబాద్.తెలంగాణ.జీఓవీలో అందుబాటులో ఉంచామన్నారు. అభ్యర్థులు తమ అన్ని వివరాలు సరిచూసుకొని, ఏమైన పొరపాట్లు ఉన్నట్లైతే ఈ నెల 6 వరకు నేరుగా జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ కార్యాలయంలో ఉదయం 10.30 నుంచే సాయంత్రం 5 లోపు పొరపాట్ల వివరాలు అందజేయాలని సూచించారు.

బైక్ చోరీ

ఆదిలాబాద్ రూరల్, మార్చి 03 (ఆంధ్రజ్యోతి) : ఇంటి ముందు నిలిపిన ద్విచక్ర వాహనం చోరీకి గురైన ఘటన ఆదిలాబాద్ వన్‌టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఆదిలాబాద్ పట్టణంలోని కుమార్ పేట్‌కు చెందిన సాయి ప్రసాద్ తన హెచ్‌ఎఫ్ డీలక్స్ బైక్‌ను ఆదివారం రాత్రి తన ఇంటి ముందు నిలిపి నిద్రపోయాడు. ఉదయం లేచి చూసేసరికి తన బైక్ దొంగతనానికి గురైంది. దీంతో సోమవారం వన్ టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ సునీల్ కుమార్ తెలిపారు.

ఎంపీ, ఎమ్మెల్యేలు స్పష్టమైన వైఖరి చెప్పాలి

● మాజీ మంత్రి జోగురామన్న



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి జోగురామన్న

ఆదిలాబాద్‌అర్బన్, మార్చి3 (ఆంధ్రజ్యోతి): సీసీఐ ఫ్యాక్టరీ పునరుద్ధరణతో పాటు ఎయిర్‌పోర్టుపై బీజేపీ ఎంపీ, ఎమ్మెల్యేలు స్పష్టమైన వైఖరి చెప్పాలని మాజీ మంత్రి జోగురామన్న డిమాండ్ చేశారు. సోమవారం బీఆర్‌ఎస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి జోగురామన్న మాట్లాడుతూ సీసీఐ సిమెంట్ పరిశ్రమ అంశంపై ఎంపీ, ఎమ్మెల్యే ప్రకటనలకు పరిమితమయ్యారని ఎద్దెవ చేశారు. బీజేపీ ఇచ్చిన హామీ ప్రకారం ఫ్యాక్టరీని ప్రారంభించకపోతే ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం ఉన్నప్పటికీ ఆదిలాబాద్ జిల్లాకు ఎంపీ గోడంనగేష్, ఎమ్మెల్యే పాయల శంకర్‌లు తీవ్ర అన్యాయం చేస్తున్నారని ఆరోపించారు. ప్రజలకు సమాధానం చెప్పలేకపోతే త్వరలో అఖిల పక్షంతో కలిసి రౌండ్‌టేబుల్ సమావేశం ఏర్పాటు చేసి సీసీఐ పునరుద్ధరణ అంశంపై ఉద్యమాలు చేపడతామన్నారు.

సబ్‌మార్కెట్‌యార్డులో శనగల కొనుగోలు కేంద్రం ప్రారంభం



శనగల కొనుగోలు ప్రారంభించిన దృశ్యం

ఉట్నూర్, మార్చి3 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని హస్నాపూర్ సబ్‌మార్కెట్ యార్డులో ఉట్నూర్ సహకార సంఘం ఆధ్వ ర్యంలో శనగల కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. సహకార సంఘం ముఖ్యకార్య నిర్వహణాధికారి మల్లయ్య ఆధ్వర్యంలో మండల వ్యవసాయ విస్తరణ అధికారులు నాగోరావు, రంజిత్‌లు శనగల కొనుగోలు కేంద్రాన్ని ప్రారం భించారు. ఈ సందర్భంగా సీఈవో మల్లయ్య మాట్లాడుతూ సహకార సంఘం ఆధ్వర్యంలో ప్రారంభించిన శనగల కొనుగోలు కేంద్రంను సద్వినియోగం చేసుకొని రైతులు తమ పంటలను ప్రభుత్వం ప్రకటించిన గిట్టుబాటు క్విం టాలు ధర రూ.5,650కి విక్రయించుకోవాలన్నారు. దళారురులను నమ్మి రైతులు మోసపోకుండా ఉండడానికే ప్రభుత్వం గిట్టుబాటు ధరను ఖరారు చేసి సహకార సంఘం ఆధ్వర్యంలో కొనుగోళ్లు చేపడుతున్నందున రైతులు వీటిని సద్వినియోగం చేసుకోవాలని మల్లయ్య కోరారు.

యువతి పెళ్లికి ఆర్థిక సాయం

నేరడిగొండ, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మంగల్‌మోట్ (తర్నం) గ్రామానికి చెందిన ఆదివాసీ ఆడపడుచులు పేదింటి యువతి పెళ్ళికి ఆర్థిక సాయం చేసి అండగా నిలిచారు. ఆదివాసీ గ్రామాల్లో (అయరి) కట్న కానుకలను నిషేధిస్తూ ఆదివాసీలు తీర్మానం చేసిన విషయం తెలిసిందే. దీంతో ఎలాంటి కట్న కానుకలు లేకపోవడంతో గ్రామంలో 62 కుటుంబాల ఆడపడుచులు కలిసి వారికి తోచినంత పొదుపు చేసుకుని రూ.12,342 ఆర్థిక సాయాన్ని అందజేశారు.

'వీర బ్రహ్మేంద్ర స్వామి కల్యాణానికి రండి'

బోథ్, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పొచ్చెర గ్రామంలో మంగళవారం నిర్వహించనున్న వీరబ్రహ్మేంద్ర స్వామి కల్యాణానికి రావాల్సిందిగా గ్రామస్తులు ఎమ్మెల్యేకు విన్నవించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేను ఆహ్వానిస్తూ అందుకు సంబంధించిన ఆహ్వాన పత్రికను ఇచ్చారు.

సమాజానికి ఆదర్శంగా నిలవాలి



ఉద్యోగులను సన్మానిస్తున్న నాయకులు

ఆదిలాబాద్ రూరల్, మార్చి 03 (ఆంధ్రజ్యోతి) : నూతనంగా ఉద్యోగాలు సాధించి ఉద్యోగోన్నతులు పొందిన ఉద్యోగులు మరింతగా సమాజానికి ఆదర్శంగా నిలవాలని, మహనీయులు ఆశయాలను కొనసాగించేందుకు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని పలువురు వక్తలు అన్నారు. ఆదిలాబాద్ రాత్రి జిల్లా కేంద్రంలోని న్యూ అంబేద్కర్ భవనంలో మాదిగ జాగృతి సంఘం ఆధ్వర్యంలో ఉద్యోగుల ఆత్మీయ సమ్మేళనాన్ని నిర్వహించారు. నూతనంగా ఉద్యోగాలు సాధించిన ఉద్యోగులకు, పదోన్నతులు పొందిన ఉద్యోగులకు ఆత్మీయంగా శాలువా కప్పి, జ్ఞాపికలను అందించారు. మహనీయుల చిత్రపటానికి పూల మాలలు వేసి కొవ్వొత్తులతో నివాళులర్పించారు. ఉద్యోగాలు సాధించడంలో వారు కష్ట నష్టాలను ఇబ్బందులను కొత్తగా ఉద్యోగులు సాధించిన అభ్యర్థులు మానోభావాలను పంచుకున్నారు. కార్యక్రమంలో రిటైర్డ్ డిప్యూటీ కలెక్టర్ గట్టయ్య, ఎస్సీ స్టడీ సర్కిల్ డైరెక్టర్ కుంటాల రమేష్, ఎంజేఏస్ ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జి రమేష్ మహారాజ్, డీఎస్పీ స్టేట్ సెక్రటరీ అన్నెల లక్ష్మణ్, డీఎస్పీ జిల్లా అధ్యక్షులు అగ్గిమల్ల గణేష్, అంబేద్కర్ సంఘాల జేఏసీ నాయకులు ఈర్ల దయాకర్, ఆర్టీసీ ఇంజనీర్ శ్రీకర్, ఎంజేఏస్ కోకన్వీనర్ అన్నెల ఆడెల్లు, ఎంజేఏస్ కో కన్వీనర్ ఓఎన్‌జీసీ సైంటిస్ట్ డాక్టర్ రవికాంత్, డీటీఎఫ్ జిల్లా నాయకులు బొల్లరపు వృకోధర్, బీఎస్పీ సీనియర్ నాయకులు గద్దల శంకర్, మహారాజ్, జేఠె టెన్త్ క్లాస్ స్టూడెంట్ ఇన్‌చార్జి అశ్విని, రిటైర్డ్ ఉపాధ్యాయుడు రాజేషుడు, ఎంజేఏస్ జిల్లా కో కన్వీనర్లు ఎల్మల నగేష్, బొర్ర నగేష్, ఏవుసం దేవన్న, రవి, తొంటికూర సంతోష్, చిప్పకుర్తి అంజయ్య, ప్రశాంత్ మహారాజ్, శ్రీకాంత్, గంగన్న, సుధీర్ పాల్గొన్నారు.

మహిళల పట్ల దురుసుగా ప్రవర్తిస్తున్న

ఐకేపీ సీఏపై చర్యలు తీసుకోవాలి



ఐకేపీ సబార్డినేట్‌కు వినతిపత్రం ఇస్తున్న కార్మిక సంఘం నాయకులు

దిలావర్‌పూర్, మార్చి 3 (ఆంధ్రజ్యోతి) : మహిళల పట్ల దురుసుగా ప్రవర్తిస్తున్న కంజర్ ఐకేపీ సీఏ నిమ్మ ముత్యంపై తగిన చర్యలు తీసుకోవాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు డాకూర్ తిరుపతి డిమాండ్ చేశారు. సోమవారం ఈ మేరకే ఐకేపీ ఏపీఎంకు వినతి పత్రం అందజేశారు. కంజర్ గ్రామానికి చెందిన ఐకేపీ సీఏ నిమ్మ ముత్యం డ్వాక్రా గ్రూప్ మహిళలపై దుర్భాషలాడుతూ బెదిరిస్తున్నాడని, డ్వాక్రా గ్రూప్ మహిళలు చెల్లించిన డబ్బులను జమ చేయకుండా కాజేస్తూ అవినీతికి పాల్పడుతున్నాడని ఆరోపించారు. ప్రశ్నించిన మహిళలను టార్గెట్ చేస్తూ ఇబ్బందులకు గురిచేస్తున్నాడని పేర్కొన్నారు. తగిన విచారణ చేసి సీఏపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. డ్వాక్రా గ్రూప్ మహిళలపై పెత్తనం చెలాయిస్తూ భారతి గ్రూప్‌కు చెందిన సెకండ్ లీడర్ అయిటి పుష్ప అనే మహిళా నాకు లోన్ కావాలని అడిగినందుకు నీకు సిగ్గు మానం ఉందా నువ్వు లోను ఎట్లా అడుగుతున్నావు అని దుర్భాషలాడుతూ బెదిరించారని పేర్కొన్నారు. డ్వాక్రా గ్రూప్ సభ్యురాలు దళిత స్త్రీ అని కూడా చూడకుండా సీఏ అవమానించడాన్ని తీవ్రంగా పరిగణించాలని కోరారు. ఐకేపీ కార్యాలయంలో ఐకేపీ ఏపీఎం లేకపోవడంతో ఐకేపీ సబార్డినేట్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఐకేపీ ఏపీఎంకు ఫోన్‌లో మాట్లాడినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం నిర్మల్ డివిజన్ నాయకులు బర్కుంట గంగారాం, సంఘం నాయకులు గడ్డం రాజేష్ పాల్గొన్నారు.

ఆయిల్ పామ్ రైతులు ఆందోళన చెందొద్దు

● ఫ్రీ యూనిట్ కంపెనీ ద్వారా మండలానికో కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేస్తాం ● ఉద్యానవన శాఖ ఆధ్వర్యంలో కొనుగోలు కేంద్రాలను పర్యవేక్షిస్తాం ● నిర్మల్ జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ ● ఆంధ్రజ్యోతి కథనానికి స్పందన ● త్వరగా జిల్లాలో ఆయిల్ ఫామ్ ఫ్యాక్టరీ పనులు ప్రారంభించాలని కంపెనీకి ఆదేశం

నిర్మల్, మార్చి 3 (ఆంధ్రజ్యోతి) : 'ఆయిల్ పామ్ పరిశ్రమపై నీలినీడలు' అనే శీర్షిక ఆంధ్రజ్యోతిలో సోమవారం ప్రచురితమైన కథనంపై నిర్మల్ జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ స్పందించారు. ఈ సందర్భంగా జిల్లాలోని ఆయిల్ ఫామ్ రైతులు ఎటువంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. ఈ ఏడాది జూన్‌లో 3,500 ఎకరాలలో ఆయిల్ ఫామ్ పంట దిగుబడి రానున్న నేపథ్యంలో ఆ పంటను కొనుగోలు చేసేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తామన్నారు. ఆయిల్ ఫామ్ పరిశ్రమను ప్రోత్సహించేందుకు ప్రభుత్వం గత మూడేళ్లుగా చర్యలు చేపట్టిందన్నారు. అందులో భాగంగా జిల్లాలో 2022-23 సంవత్సరంలో 1,322 మంది రైతులు 3,567 ఎకరాలలో, 2023-24 సంవత్సరంలో 1,548 మందిరైతులు 3,498 ఎకరాలలో, 2024-25 సంవత్సరంలో 423 మంది రైతులు 1,073 ఎకరాలలో ఆయిల్ ఫామ్ పంటను సాగు చేశారన్నారు. జిల్లాలో రైతాంగం సాగు చేసిన ఆయిల్‌ఫామ్ పంటను ఫ్రీ యూనిట్ కంపెనీ ద్వారా కొనుగోలు చేయాల్సి ఉందన్నారు. అందుకు గాను నిర్మల్ జిల్లాలో ఆయిల్ ఫామ్ ఫ్యాక్టరీని ఏర్పాటు చేయాల్సి ఉందన్నారు. ఫ్యాక్టరీ ఏర్పాటు ఆలస్యమైన సందర్భంగా రైతులు ఎటువంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని ఉద్యానవనశాఖ ఆధ్వర్యంలో ఫ్రీ యూనిట్ కంపెనీ ద్వారా మండలానికో కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేస్తామని కలెక్టర్ భరోసా ఇచ్చారు. ప్రతి ఎకరానికి మొదటి సంవత్సరం రెండు టన్నుల ఆయిల్‌ఫామ్ పంట దిగుబడి వచ్చే అవకాశం ఉన్నందున నిర్మల్ జిల్లాలో ఆయిల్ ఫామ్ ఫ్యాక్టరీ ఏర్పాటుకు ప్రభుత్వం అనుమతించిందన్నారు. వీలైనంత త్వరగా జిల్లాలో ఆయిల్ ఫామ్ ఫ్యాక్టరీ పనులను ప్రారంభించాలని కంపెనీ నిర్వాహకులను ఆదేశించారు.

పెళ్లి ఊరేగింపులో గొడవ

● యువకుడిపై కత్తితో దాడి ● తలలో ఇరుక్కున్న కత్తి ● నిర్మల్ జిల్లాలో ఘటన



శ్రీకర్ తలలో ఇరుక్కున్న కత్తి.. ఎక్స్‌రే దృశ్యం

నిర్మల్ రూరల్, మార్చి 3 (ఆంధ్రజ్యోతి) : పెళ్లి ఊరేగింపులో తాగిన మత్తులో ఓ యువకుడిపై కత్తితో దాడి చేసి తీవ్రంగా గాయపర్చిన ఘటన నిర్మల్ జిల్లాలో ఆదివారం అర్ధరాత్రి చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళితే.. నిర్మల్ మండలంలోని రత్నాపూర్ కాండ్లి తండాకు చెందిన మాలావత్ రాజు (19) వ్యవసాయం చేస్తూ జీవనం కొనసాగిస్తున్నాడు. ఆదివారం గ్రామంలో తమ బంధువుల పెళ్లికి వెళ్లాడు. పెళ్లి తర్వాత రాత్రి 10గంటల సమయంలో భరత్ జరుగుతుండగా.. మాలావత్ రాజు అక్కడికి వెళ్లి డ్యాన్స్ చేశాడు. దీంతో అదే గ్రామానికి చెందిన సిలిగేలా శ్రీకర్ అనే వ్యక్తి.. మద్యం మత్తులో డ్యాన్స్ ఎందుకు చేస్తున్నావ్ అంటూ రాజును అక్కడి నుంచి వెళ్లగొట్టాడు. అయితే గ్రామస్థులందరి ముందు తనను శ్రీకర్ అలా అనడంతో.. రాజు తీవ్ర అవమానానికి గురయ్యాడు. అర్ధరాత్రి 12గంటల సమయంలో భరత్ అయిపోయిన తర్వాత శ్రీకర్ తన బైక్‌పై ఇంటికి బయలుదేరాడు. అప్పటికే మద్యం మత్తులో ఉన్న రాజు కాపు కాసి శ్రీకర్ బైక్‌ను అడ్డగించాడు. 'గ్రామంలో అందరి ముందు నన్ను అవమాన పరుస్తావా.. నిన్ను ఈరోజు చంపేస్తాను..' అని తన జేబులో పెట్టుకున్న కత్తితో పొడవగా.. శ్రీకర్ కుడివైపు కన్ను దగ్గర కత్తి ఇరుక్కొని పోయింది. దీంతో శ్రీకర్‌ను అతని స్నేహితులు నిర్మల్‌లోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఆ తర్వాత మెరుగైన చికిత్స నిమిత్తం కుటుంబీకులు అతన్ని నిజామాబాద్‌లోని ఓ ప్రయివేటు ఆస్పత్రికి తరలించారు. కాగా.. మాలావత్ రాజును అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్టు నిర్మల్ రూరల్ ఎస్సై లింబాద్రి తెలిపారు.

కవి రెడ్ల బాలాజీకి జాతీయ పురస్కారాలు..డాక్టరేట్ ప్రదానం



జాతీయ పురస్కారం, డాక్టరేట్ అందుకుంటున్న రెడ్ల బాలాజీ

ముధోల్, మార్చి 3 (ఆంధ్రజ్యోతి) : హైదరాబాద్, రవీంద్ర భారతి శ్రీ ఆర్యాని సకల కళా వేదిక ఆధ్వర్యంలో ఆదివారం జరిగిన వేడుకల్లో ప్రముఖ కవి, రచయిత, మోటివేషన్ స్పీకర్ రెడ్ల బాలాజీకి ప్రతిష్టాత్మక జాతీయ పురస్కారాలు అందజేశారు. ఈ వేడుకల్లో జాతీయ ఉగాది పురస్కారం, జాతీయ విశ్వశాంతి పురస్కారం, బంగారు పతకం వంటి పురస్కారాలతో పాటు డే స్ప్రింగ్ ఇంటర్నేషనల్ యూనివర్సిటీ, ఇంగ్లాండ్ తరపున గౌరవ డాక్టరేట్ ప్రదానం చేయబడిందని తెలిపారు. ఈ పురస్కారాలను ప్రముఖ కవి, రచయిత డాక్టర్ దూడపాక శ్రీధర్ ప్రముఖ సినీ దర్శకుడు సముద్ర చేతుల మీదుగా అందజేశారు. ఈ సందర్భంగా పలువురు కవులు, రచయితలు, సాహితీ ప్రియులు రెడ్లబాలాజీని అభినందించారు.

సీసీఐ కథ ముగిసినట్లే..

(5వ పేజీ తరువాయి...)

చేయనున్నారు. ఇప్పటికే పరిశ్రమలోని కొన్ని యంత్రాలు చోరీకి గురయ్యాయి. ఉన్న యంత్రాలు పూర్తిగా తుప్పపట్టి పోయి కనిపిస్తున్నాయి.

2017లోనే క్లోజర్ నోటీసులు

పరిశ్రమను పూర్తిస్థాయిలో మూసివేస్తున్నట్లు సీసీఐ సంస్థ 2017లోనే క్లోజర్ నోటీసులను ఇచ్చింది. దీంతో కార్మికులు పెండింగ్ వేతనాల కోసం హైకోర్టును ఆశ్రయించారు. 2008 వరకు పెండింగ్‌లో ఉన్న బకాయి వేతనాలను చెల్లించేందుకు సీసీఐ ఒప్పుకోగా.. కార్మికులు మాత్రం 2017 వరకు వేతనాలను చెల్లించాలంటూ డిమాండ్ చేస్తున్నారు. వేతనాలు చెల్లించకుండా పరిశ్రమ ఆస్తులను అమ్మేందుకు వీలు లేదంటూ కోర్టు ఆదేశించడంతో అప్పట్లో స్క్రాప్ టెండర్లను అర్ధాంతరంగానే నిలిపి వేశారు. మళ్లీ తాజాగా స్క్రాప్ టెండర్లను పిలవడంపై కార్మికులు మండిపడుతున్నారు. ఈనెల 6న తిరిగి హైకోర్టును ఆశ్రయించేందుకు సిద్ధమవుతున్నారు. కోర్టు తీర్పుకు వ్యతిరేకంగా సీసీఐ వ్యవహరిస్తుందంటూ కార్మికులు ఆరోపిస్తున్నారు. చట్ట విరుద్ధంగా టెండర్లను నిర్వహిస్తే అడ్డుకుంటామని హెచ్చరిస్తున్నారు.

వడ్తాల్‌లో దొంగతనం



సంఘటన స్థలాన్ని పరిశీలిస్తున్న ఎస్సై

ముథోల్, మార్చి 3 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని వడ్తాల్ గ్రామంలో తాళం వేసిన ఇంటి తాళం పగలగొట్టి దొంగతనం చేశారు. ఇంటిలోని బీరువాలో ఉన్న నాలుగు తులాల బంగారు ఆభరణాలు, పది తులాల వెండి, నగదు రూ. 17 వేల రూపాయలు ఎత్తుకెళ్లారు. బాధితులు, పోలీసుల కథనం ప్రకారం... వడ్తాల్ గ్రామానికి చెందిన దుద్దు గంగన్న అనే వ్యక్తి ఈ నెల 1వ తేదీన తన కుటుంబ సభ్యులతో కలిసి ఇంటికి తాళం వేసి తమ బంధువుల ఇంటికి శుభకార్యం కోసం మండలంలోని ఆష్ట గ్రామానికి వెళ్లాడు. బంధువుల ఇంటి నుంచి సోమవారం తన ఊరికి తిరిగి వచ్చాడు. అయితే తన ఇంటి తాళం పగలగొట్టి ఉండటంతో ఇంట్లోకి వెళ్లి చూశారు. బీరువాలో నుంచి బంగారం, వెండితో పాటు నగదు గుర్తు తెలియని వ్యక్తులు దోచుకెళ్లారని గ్రహించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. సంఘటన స్థలాన్ని ఎస్సై సంజీవ్ పరిశీలించారు. పలు వివరాలు అడిగి తెలుసుకున్నారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

బాధిత కుటుంబానికి పరామర్శ



కుంటాలలో బాధిత కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే నారాయణరావు పటేల్

కుంటాల, మార్చి, 3 : (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రం కుంటాల మాజీ పట్వారీ సాదుల లింబగిరి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. ఆయన కుటుంబ సభ్యులను సోమవారం నిర్మల్ మాజీ ఎమ్మెల్యే నల్ల ఇంద్రకరణ్‌రెడ్డి, ముథోల్ మాజీ ఎమ్మెల్యేలు నారాయణరావు పటేల్, విఠల్‌రెడ్డిలు పరామర్శించారు. ఆయన మృతికి గల కారణాలను కుటుంబ సభ్యులు సుదర్శన్, గోవర్ధన్‌లకు అడిగి తెలుసుకున్నారు. వీరి వెంట పలువురు నాయకులు తదితరులు ఉన్నారు.

మండల పరిషత్

ప్రాథమిక పాఠశాలలో వరుస చోరీలు



పగిలిన తాళం చూపెడుతున్న హెచ్‌ఎం సవిత హేమంత్

ఉట్నూర్, మార్చి3 (ఆంధ్రజ్యోతి): ఉట్నూర్ మండల కేంద్రంలోని ఎస్సీవాడలో ఉన్న మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో వరుస దొంగతనాలు చోటు చేసుకుంటున్నాయి. గత రెండేళ్ల కాలంలో వరుసగా నాలుగుసార్లు పాఠశాలలో తాళాలు పగులగొట్టి బియ్యం చోరీకి పాల్పడుతున్నారని పాఠశాల హెచ్‌ఎం జాదవ్‌సవిత హేమంత్ తెలిపారు. ఆదవారం రాత్రి సైతం దొంగలు పాఠ శాలలోని తరగతి గదుల తలుపులు పగలగొట్టడమే కాకుండా స్టోర్‌రూమ్‌లో ఉన్న క్వింటాల్ బియ్యంతో పాటు 5000 విలువ గల సౌండ్ సిస్టంను దొంగలించారని హెచ్‌ఎం తెలిపారు. వరుస దొంగతనాలకు పాల్పడుతుండటంతో వేలాది రూపాయల నష్టం ఏర్పడుతుందని దొంగలను పోలీసులు పట్టుకొని శిక్షించాలని కోరారు. సోమవారం పాఠశాలకు వచ్చి చూసే సరికి తాళాలు పగిలి ఉన్నాయని, క్వింటాల్ బియ్యం చోరీకి గురి అయ్యాయని తెలిపారు. ఈ మేరకు ఉట్నూర్ పోలీసులకు పిర్యాదు చేశామని తెలిపారు.

కాంగ్రెస్ రాష్ట్ర వ్యవహారాల

ఇన్‌చార్జీని కలిసిన కంది శ్రీనివాస్‌రెడ్డి



ఆదిలాబాద్‌అర్బన్, మార్చి3 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జీ మీనాక్షి నటరాజన్‌ను మంత్రి సీతక్కతో కలిసి ఆదిలాబాద్ అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జీ కంది శ్రీనివాస్‌రెడ్డి కలి శారు. మహారాష్ట్ర వార్ధాలోని సేవా గ్రామ్‌లో జరిగిన ముఖ్య సమా వేశానికి వారు హాజరయ్యారు. తెలంగాణలో కాంగ్రెస్ పార్టీని బూత్ స్థాయి నుంచి మరింత బలోపేతం చేయాలని తెలంగాణ ఇన్‌చార్జీ మీనాక్షి నటరాజన్ నేతలకు సూచించారన్నారు. ఆదిలాబాద్ అసెంబ్లీ నియోజక వర్గానికి సంబంధించి పార్టీని మరింత పటిష్టస్థితికి చేర్చేలా కృషి చేస్తానని కంది శ్రీనివాస్‌రెడ్డి నేతలకు చెప్పినట్లు తెలిపారు.

కారులో మంటలు



ఆదిలాబాద్ రూరల్, మార్చి 3 (ఆంధ్రజ్యోతి) : షార్ట్‌సర్క్యూట్ కారణంగా ఓ కారు దగ్ధమైన ఘటన ఆదిలాబాద్‌లో చోటుచేసుకుంది. పట్టణంలోని ఏరోడ్రమ్ సమీపంలో కృష్ణ నగర్ వద్ద ఓ ఎర్టిగా కారులో షార్ట్ సర్క్యూట్ కారణంగా మంటలు అంటుకున్నాయి. దీంతో మంటలు కారు మొత్తం వ్యాపించాయి. గమనించి ఫైర్ సిబ్బందికి సమాచారం అందజేశారు. ఘటనా స్థలానికి చేరిన సిబ్బంది మంటలను అదుపు చేశారు. కాగా కారులో ఎవరు లేకపోవడంతో ఎలాంటి ప్రమాదం జరగలేదు.

బరంపూర్ ఆలయంలో సుదర్శన మహాయజ్ఞం



స్వామివారికి సేవ నిర్వహిస్తున్న భక్తులు



అలంకరించిన స్వామి వారి ఉత్సవ విగ్రహాలు

తలమడుగు, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): ఆదిలాబాద్ జిల్లా తలమడుగు మండలంలోని బరపుకొండపై స్వయంభుగా వెలసిన శ్రీ వెంకటేశ్వరస్వామి ఆలయంలో నిర్వహిస్తున్న బ్రహ్మోత్సవ సందర్భంగా రెండవరోజు సోమవారం వేద పండితులతో సుదర్శన మహాయజ్ఞం, శ్రీదేవి భూదేవి వేంకటేశ్వరస్వామికి పంచామృతంతో అభిషేకం, అనంతరం ఉంజల సేవ నిర్వహించారు. అనంతరం స్వామివారికి ప్రత్యేకపూజ కార్యక్రమాలు నిర్వహించి భక్తులకు తీర్థ ప్రసాదాలు, మహా అన్నదానం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ అధ్యక్షులు ముడుపు కేధరేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ బ్రహ్మోత్సవ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించడం జరిగిందన్నారు. అదేవిధంగా ఈనెల 4న మంగళవారం నిర్వహిస్తున్న రథోత్సవ కార్యక్రమానికి ప్రజా ప్రతినిధులు, అధికారులు, భారీసంఖ్యలో భక్తులు తరలివచ్చారు. భక్తుల కోసం ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు గ్రామస్థుల సహకారంతో మహా అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి అధికసంఖ్యలో భక్తులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఇందులో అభివృద్ధి కమిటీ అధ్యక్షులు కేదారేశ్వర్‌రెడ్డి, .కమిటీ సభ్యులు బరకం మల్లేష్ . ప్రతాప్, నాగిరెడ్డి, రాజు, మాదురి రమాకాంత్, పొట్టిపెళ్లి శ్రీనివాస్, మాజీ ఎంపీటీసీ రంజిత్‌రెడ్డి, మాజీ సర్పంచ్ భగీరథ భాయ్, మాజీ ఉప సర్పంచ్ నారాయణరెడ్డి, వేద పండితులు రాంగోపాల్ చారి, స్వస్తిక్‌స్వామి, నేరెళ్ల కల్యాణ్‌కుమార్ గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి నిత్యావసర సరుకులు అందజేత



సిరికొండ, మార్చి 3(ఆంధ్రజ్యోతి): మండలంలోని సోన్‌పెల్లి గ్రామానికి చెందిన వాగ్మారే మాధవ్‌రావ్ ఇల్లు ఆదివారం షార్ట్‌సర్క్యూట్‌తో పూర్తిగా దగ్ధమై దాదాపు 3 లక్షల వరకు నష్టం జరిగిందని రెవెన్యూ అధికారులు అంచనా వేశారు. విషయం తెలుసుకున్న ఎస్సై శివరాం, మాజీ జడ్పీటీసీ కుమ్ర చంద్రకళ రఘురాం, బీజేపీ మండల అధ్యక్షుడు అమోల్ బాధిత కుటుంబానికి ఆర్థిక చేయూతను అందించారు. ఎస్సై శివరాం బాధిత కుటుంబానికి నిత్యావసర సరుకులు, దుప్పట్లు పంపిణీ చేయగా, మాజీ సర్పంచ్ కదం సూర్యకాంత్ రూ 5 వేలు, బీజేపీ మండల అధ్యక్షుడు బోయిన్‌వాడ్ అమోల్, మాజీ జడ్పీటీసీ రఘురాంలు రూ5 వేల నగదును అందజేశారు. బాధిత కుటుంబానికి ప్రభుత్వ పరంగా ఆదుకునేలా కృషి చేస్తామని ఈ సందర్భంగా కుటుంబసభ్యులకు భరోసా కల్పించారు. కార్యక్రమంలో మాజీ ఉపసర్పంచ్ సిడాం జాకు, జగతప్ ఈశ్వర్, బోయిన్‌వాడ్ తులసిదాస్, సూర్యవంశీ కామాజీ, పవార్ సుధాకర్, గాయక్వాడ్ గుణాజీ, సూర్యకాంబ్లే తుకారాం, తదితరులు పాల్గొన్నారు.

బాదిత కుటుంబానికి నిత్యావసర సరుకులు అందజేస్తున్న ఎస్సై శివరాం

క్రీడలతో మానసికోల్లాసం.. శారీరక అభివృద్ధి



మాకోడలో క్రికెట్ క్రీడాకారులకు బహుమతులు అందజేస్తున్న నాయకులు

జైనథ్, మార్చి3 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులు చదువుతో పాటు క్రీడలు ఆడడం ద్వారా మానసిక ఉల్లాసంతో పాటు శారీరక అభివృద్ధి జరుగుతుందని దీపాయిగూడ మాజీ సర్పంచ్ బొల్లిగంగన్న అన్నారు. రాష్ట్ర మాజీ మంత్రి జోగురామన్న తల్లిదండ్రులైన జోగు ఆశన్న, జోగు భోజమ్మల జ్ఞాపకార్థం మాకోడ గ్రామంలో నెల రోజుల పాటు జరుగుతున్న క్రికెట్ టోర్నమెంట్ సోమవారంతో ముగిశాయి. మొదటి బహుమతిగా ఆదిలాబాద్ అభియూత్‌కు, ద్వితీయ బహుమతిగా దీపాయిగూడ క్రికెట్ జట్లకు అందజేశారు. కార్యక్రమంలో లోకకృష్ణారెడ్డి, కృషి యూత్ క్లబ్ అధ్యక్షులు రాములుతో పాటు ఆయా గ్రామాల క్రికెట్ క్రీడాకారులు పాల్గొన్నారు. భారీ సంఖ్యలో క్రికెట్ అభిమానులు పాల్గొని క్రీడలు తిలకించారు.

నాగోబా దేవతను దర్శించుకున్న

నిర్మల్ బీజేపీ జిల్లా అధ్యక్షుడు రితేష్ రాథోడ్



ఆలయంలో రితేష్ రాథోడ్

ఇంద్రవెల్లి, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): నిర్మల్ బిజెపి జిల్లా అధ్యక్షునిగా బాధ్యతలు తీసుకున్న తర్వాత మొదటిసారి రితేష్ రాథోడ్ సోమవారం నాగోబా దేవతను బీజేపీ మండల నాయకులతో కలిసి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆలయ కమిటీ సభ్యులు శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలంతా సుఖ సంతోషాలతో ఆయురారోగ్యాలతో ఉండాలని అన్నారు. ఆయన వెంట బిజెపి మండల పార్టీ అధ్యక్షుడు ఆరెల్లి రాజలింగం, జిల్లా నాయకులు శివకుమార్ జైస్వాల్, మారుతి దేవ్ పూజె, మాజీ చైర్మన్ మెశ్రం తుకారం, నాయకులు దిలీప్ మోరే, మాస్కే రాజవర్దన్, పెందుర్ గణేష్, యోగేష్ తదితరులు పాల్గొన్నారు.

సమత ఫౌండేషన్ ఆధ్వర్యంలో

అంజనీ తాండ గ్రామ కమిటీ ఎన్నిక

నర్సాపూర్(జి), మార్చి 3 (ఆంధ్రజ్యోతి) : సమత ఫౌండేషన్ ఆధ్వర్యంలో నర్సాపూర్(జి) మండలంలోని అంజనీ తాండ గ్రామంలో గ్రామ కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా రాథోడ్ శ్రీను, ఉపాధ్యక్షుడిగా జాదవ్ పిరాజి, జనరల్ సెక్రటరీగా జాదవ్ దిలీప్, సెక్రటరీగా రాథోడ్ శంకర్, కోశాధికారిగా చౌహన్, జాదవ్ శివానంద్, జాదవ్ శ్రీధర్‌లు ఎన్నుకోబడ్డారు. ఈ కార్యక్రమంలో సీఈవో అనిల్ కుమార్, సభ్యులు బర్కుంట ముత్యం, షేక్ సాజిత్‌లు పాల్గొన్నారు.

మానసిక స్థితి బాగా లేక ఒకరి ఆత్మహత్య

ఉట్నూర్, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): ఉట్నూర్ మండల కేంద్రంలోని పాత ఉట్నూర్‌లో మానసిక స్థితి భాగాలేని వ్యక్తి ఆదివారం రాత్రి ఇంట్లో ఉరి వేసుకొని మృతి చెందాడని ఉట్నూర్ ఎస్సై మనోహర్ తెలిపారు. నాలుగేళ్ల క్రితం భార్యగంగమ్మ మృతి చెందిన నాటి నుంచి మనోవేదనకు గురి అయిన రాజలింగు (60)తాగుడుకు బానిసై ఆదివారం రాత్రి తన గదిలో ఉరేసుకొని ఆత్మహత్యకు పూనుకున్నాడని కుమారుడు రాజ్‌కుమార్ ఇచ్చిన పిర్యాదు మేరకు సోమవారం కేసు నమోదు చేసి శవాన్ని పోస్టుమార్టం పంపించి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

మహారాష్ట్ర మద్యంతో పట్టుబడిన వ్యక్తి



బోథ్, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): మహారాష్ట్ర సరిహద్దుల్లో ఉన్న ఘన్పూర్ చెక్ పోస్టు వద్ద అక్రమంగా తరలిస్తున్న మద్యం పట్టుకున్నారు. నిందితుడిపై కేసు నమోదు చేసినట్లు ఎక్సైజ్ సీఐ జుల్ఫికర్ అహ్మద్ తెలిపారు. బజా ర్హత్నూర్ మండలం దేగామా గ్రామానికి చెందిన శ్రీనివాస్ అనే వ్యక్తి ఆదివారం రాత్రి తన ద్విచక్ర వాహనంపై 8,400 విలువైన మద్యం తీసుకువస్తూ పట్టుబడ్డన్నారు. దీంతో ఆయనపై కేసు నమోదు చేసి నట్లు సిఐ తెలిపారు. మహారాష్ట్ర నుండి అక్రమంగా మద్యం తీసుకు వచ్చినట్లయితే కఠిన చర్యలు తప్పవని ఆయన పేర్కొన్నారు.



నిండుగా పూతతో ఉన్న కంది పంట

కంది సాగు.. భలే బాగు!

● చీడపీడల బెడద అసలే లేదు.. ● ఖరీఫ్‌లో కంటే రబీలోనే సాగు బాగుందంటున్న రైతులు ● తాంసిలో 200 ఎకరాల్లో సాగు

తాంసి, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): రబీలో కంది సాగు బాగుందని.. చీడ పీడల బెడద అసలే లేదని రైతులు చెప్తున్నారు. చాలామంది రైతులు కంది పంటను ఖరీఫ్ సీజన్‌లోనే సాగు చేస్తారు. కానీ ఈ సంవత్సరం వందలా మంది రైతులు రబీలో కూడా ఈ పంటను సాగు చేశారు. పంట చేతికి వస్తుందో రాదో అని మొదట్లో ఆందోళన పడిన రైతులు ఇప్పుడు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. రైతులు విత్తనాలు నాటి రెండు మాసాలు కావస్తోంది. ప్రస్తుతం పంట పూతదశకు చేరుకుందని, కొన్ని పొలాల్లో ఖాత కూడా వచ్చిందని రైతులు చెప్తున్నారు. ఖరీఫ్ సాగు కంటే రబీలో సాగుకు ఎలాంటి చీడపీడల బెడద లేదని తెలిపారు. తాంసి మండలంతో పాటు తలమడుగు, భీంపూర్ మండలాల్లో కూడా ఈసారి సుమారు 200 ఎకరాలలో ఈ పంటను సాగు చేస్తున్నారు. మరో నెల రోజుల్లో చేతికి రానుందని ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం పంటను చూస్తే ఎకరానికి 5 నుంచి 7 క్వింటాళ్ల వరకు దిగుబడి రావచ్చని అంటున్నారు. ప్రభుత్వం, అధికార యంత్రాంగం స్పందించి కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలని సాగు రైతులు కోరుతున్నారు.

వేసవి పంట బాగానే ఉంది

● మూసుకు జయపాల్‌రెడ్డి, రైతు, సుంకిడి



ఖరీఫ్‌లో కంటే రబీలో కంది సాగు చాలా బాగుంది. ఎండల తీవ్రత ఎక్కువగా ఉండటంతో నీటి తడి ఇవ్వాల్సి ఉంటుంది. చీడపీడల బెడద చాలా తక్కువ అని చెప్పొచ్చు. నేడు ఏడు ఎకరాలలో ఈ సంవత్సరం కంది సాగు చేస్తున్నా. ప్రస్తుతం పంటను చూస్తే ఆశాజనకంగా ఉంది.



మీడియా సమావేశంలో మాట్లాడుతున్న ఏబీవీపీ నాయకులు

పదో తరగతి ప్రీ ఫైనల్

పరీక్ష వేళల్లో మార్పులు చేయాలి

● ఏబీవీపీ ఇందూర్ విభాగ్ కన్వీనర్

నిర్మల్ రూరల్, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): ఈనెల 6 నుంచి జరిగే పదో తరగతి ప్రీ ఫైనల్ పరీక్ష వేళల్లో మార్పులు చేస్తూ స్కూల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ తీసుకున్న నిర్ణయాన్ని వ్యతిరేకిస్తున్నట్లు ఏబీవీపీ ఇందూర్ విభాగ్ కన్వీనర్ కైరి శశిధర్ మీడి యా సమావేశంలో తెలిపారు. ఈ సంద ర్భంగా ఆయన విద్యార్థులు మధ్యాహ్నం భోజనం చేసే సమయంలో మిట్ట మధ్యాహ్నం మండుటెండలో పరీక్షలు నిర్వహించాలని ఏ విద్యావేత్తలు, వైద్యనిపుణులు చెప్పారో వెల్లడించాలని, ఒక వర్గాన్ని సంతృప్తి పరచడం కోసం విద్యార్థుల ప్రాణాలను పణంగా పెట్టి మరిఓటు బ్యాంకు రాజకీయాలు చేయడం సిగ్గుచేటని అన్నారు. వెంటను ఉదయం వేళలో పరీక్షలు నిర్వహించేలా పరీక్ష సమయంలో మార్పులు చేయా లని డిమాండ్ చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సాయికుమార్, సాత్విక్, జగదీష్, బిన్ను, అఖిల్, గణేష్, తదితరులు ఉన్నారు.



● ఎండల కారణంగా ముఖానికి స్కార్ఫ్ కట్టుకొని వెళ్తున్న మహిళ

ఆదిలాబాద్‌లో మండుతున్న ఎండలు

● రెండు రోజులుగా పెరుగుతున్న ఉష్ణోగ్రతలు

ఆదిలాబాద్‌రూరల్, మార్చి3 (ఆంధ్రజ్యోతి): మార్చి మొదటి వారంలోనే ఎండలు మండుతున్నాయి. గత రెండు రోజులుగా ఉష్ణోగ్రతలు క్రమంగా పెరుగుతున్నాయి. రాష్ట్రవ్యాప్తంగా తేమ శాతం తగ్గడంతో ఎండలు పెరిగాయి. సాధారణం కన్న మూడు నుంచి 4 డిగ్రీలు అధికంగా ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. ఆదిలాబాద్ జిల్లాలో ఉష్ణోగ్రతలు ఎక్కువగా వాతావరణ శాఖ తెలిపింది. మరో రెండు మూడు రోజుల పాటు పరిస్థితి ఇలా ఉంటుందని పేర్కొంది. అయితే జిల్లాలోని జైనథ్, గుడిహత్నూర్, బేల, గాదిగూడలో 38 డిగ్రీలు నమోదు కాగా.. తలమడుగు, తాంసి, బోథ్‌లో 37.9 డిగ్రీలుగా ఉంది. ఇదిలా ఉంటే ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలో 36.3 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. దీంతో జనాలు బయటకు వచ్చేందుకు జంకుతున్నారు. బయటకు వచ్చినా ఎండ నుంచి రక్షణ కల్పించే విధంగా తలకు పాగ కట్టుకొని వస్తున్నారు. రెండు మూడు రోజుల పాటు ఎండలు పెరిగే అవకాశాలున్న నేపథ్యంలో జనాలు జాగ్రత్తలు పాటించాలని వైద్యులు చెబుతున్నారు. అదే విధంగా చిరు వ్యాపారులు ఎండ నుంచి రక్షణ పొందేల గొడుగులను వినియోగిస్తున్నారు. అదే సాధారణ ప్రజలు చల్లనీ పానీయాలు తాగుతూ ఉపశమనం పొందుతున్నారు.



ఎండలకు నిర్మానుష్యంగా మారిన ఆదిలాబాద్‌లోని ప్రధాన రోడ్డు



ఉట్నూర్‌లో ఏర్పాటు చేసిన పరీక్షా కేంద్రం

ఇంటర్ పరీక్షకు ఏర్పాట్లు పూర్తి

● నిఘా నీడన కొనసాగనున్న ఇంటర్మీడియట్ విద్యార్థుల పరీక్షలు ● కేంద్రాలకు గంట ముందే చేరుకోవాలన్న అధికారులు

ముథోల్, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): రేపటి నుంచి ఇంటర్మీడియట్ వార్షిక పరీక్షలు ప్రారంభం కానున్నాయి. ఇందుకు విద్యాశాఖ అధికారులు ఏర్పాట్లు పూర్తిచేశారు. ఈ పరీక్షలు ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు జరగనున్నాయి. అయితే విద్యార్థులు పరీక్ష సెంటర్ల వద్దకు గంట ముందే రావాలని అధికారులు పేర్కొన్నారు. ముథోల్‌లోని ప్రభుత్వ సాంఘిక సంక్షేమ గురుకుల కళాశాల సెంటర్‌లో 182మంది ప్రథమ సంవత్సరం విద్యార్థులు, 224 మంది ద్వితీయ సంవత్సరం విద్యార్థులు పరీక్షలు రాయనున్నట్లు చీఫ్ సూపరింటెండెంట్ నర్సింహారెడ్డి తెలిపారు. డీవోగా లావణ్య వ్యవహరించనున్నట్లు తెలిపారు. 24 మంది విద్యార్థులకు ఒక ఇన్విజిలేటర్ చొప్పున ఇన్విజిలేటర్లను నియమిస్తున్నట్లు తెలిపారు. అలాగే ప్రభుత్వ జూనియర్ కళాశాల పరీక్షా కేంద్రంలో 338 మొదటి సంవత్సరం విద్యార్థులు, 272 మంది ద్వితీయ సంవత్సరం విద్యార్థులు మొత్తం 610 మంది విద్యార్థులు పరీక్ష రాయనున్నట్లు చీఫ్ సూపరింటెండెంట్ మీరాజ్ మహమూద్ తెలిపారు. డీవోగా అబ్దుల్ మతిన్ వ్యవహరించనున్నట్లు పేర్కొన్నారు. 20మంది విద్యార్థులకు ఒక ఇన్విజిలేటర్ చొప్పున తమ సెంటర్‌లో 23మంది ఇన్విజిలేటర్లను నియమించినట్లు పేర్కొన్నారు. విద్యార్థులు పరీక్షా కేంద్రానికి పరీక్ష సమయం కంటే గంట ముందే హాజరు కావాలని కోరారు. ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా పరీక్షా కేంద్రాల్లో అన్ని ఏర్పాట్లు చేసినట్లు నిర్వాహకులు తెలిపారు.



పరీక్షలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సూచనలిస్తున్న ఉపాధ్యాయులు

● ఉట్నూర్‌లో ఆరు పరీక్ష కేంద్రాలు

ఉట్నూర్, మార్చి3 (ఆంధ్రజ్యోతి): బుధవారం నుంచి ప్రారంభంకానున్న ఇంటర్మీడియట్ విద్యార్థుల పరీక్షల కోసం ఉట్నూర్ మండలంలో ఆరు పరీక్ష కేంద్రాలను ఇంటర్ బోర్డు అధికారులు ఏర్పాటు చేశారు. ఉట్నూర్ మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మొదటిరోజు 346 బాలికల, కొమురంభీం ప్రాంగణంలోని బాలికల గురుకుల జూనియర్ కళాశాలలో 348 మంది, లాల్ టేకిడి బాలుర జూనియర్ గురుకుల కళాశాలలో 368 మంది, ఉట్నూర్ పట్టణంలోని పులాజిబాబా జూనియర్ కళాశాలలో 438 మంది, చైతన్య జూనియర్ కళాశాలలో 272 మంది, ఏఆర్ఎస్ జూనియర్ కళాశాలలో 304 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు అయ్యే విధంగా కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు ఇంటర్ కస్టోడియన్ వినోద్ తెలిపారు.

● బోథ్‌లో రెండు పరీక్ష కేంద్రాలు

బోథ్: రేపటి నుంచి ఈనెల 25 వరకు నిర్వహించనున్న పరీక్షలకు ఇంటర్మీడియేట్ బోర్డు అధికారుల పకడ్బందీ ఏర్పాట్లు చేశారు. అందులో భాగంగానే మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల, సాంఘిక సంక్షేమ గురుకుల కళాశాలలో ఇంటర్ విద్యార్థులు పరీక్షలు రాయనున్నారు.

● సీసీ కెమెరాల నిఘా

పరీక్ష పత్రాలు అందించే సమయం నుంచి పరీక్ష ముగిసేంతవరకు సీసీ కెమెరాల నిఘా ఉండనుంది. ఇంటర్మీడియట్ బోర్డు అధికారులకు కెమెరాలు లింక్ అయి ఉండడంతో అక్కడ అధికారులు ప్రతీ సెంటర్‌లో జరిగే పరీక్షలను పరిశీలించనున్నారు. అంతేగాక ఆ సమయంలో నిరంతర విద్యుత్‌సరఫరా ఉండాలని ప్రభుత్వం నుంచి ఆదేశాలు నిలబడ్డాయి. మరోవైపు సెం టర్ల సమీపంలో ఉన్న జిరాక్స్ సెంటర్‌లను మూసి ఉంచాలని ఆదేశాలు పోలీసుల నుంచి వెలబడ్డాయి.

● వసతులన్నీ కల్పించాం

పరీక్షలు రాసే విద్యార్థుల కోసం వసతులు అన్నింటిని కల్పించడం జరిగిందని సాంఘిక సంక్షేమ గ్రూపుల కళాశాల ప్రిన్సిపాల్ సంగీత వివరించారు. విద్యార్థులకు ఇబ్బంది కలగకుండా ఫ్యాన్లు లైటింగ్ నిరంతర విద్యుత్‌తోపాటు వైద్యసిబ్బంది సెంటర్ వద్ద ఉండేవిధంగా చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఇప్పటికే ఆయా శాఖల వారికి ప్రభుత్వం నుంచి ఆదేశాలు వెలువడ్డాయని పేర్కొన్నారు. తమ కళాశాలలో పరీక్ష రాసేవారు 8 గంటల 45 నిమిషాలకు కళాశాల ఆవరణలో ఉండాలన్నారు. ఆలస్యమైతే లోనికి అనుమతించేది లేదని పేర్కొన్నారు.

● ప్రత్యేక అధికారుల నిఘా

పరీక్షల సందర్భంగా ప్రత్యేక అధికారుల నిఘా ఉంటుందని జూనియర్ కళాశాల సాంఘిక సంక్షేమ గురుకుల కళాశాలలో సీఎస్‌తో పాటు డీవోలు పరీక్షలను పర్యవేక్షణ చేస్తారన్నారు. ఉదయం 9 గంటల నుంచి 12 గంటల వరకు పరీక్ష పూర్తవుతుందని అధికారులు పేర్కొంటున్నారు. కాగా ఎట్టి పరిస్థితుల్లో మాస్ కాపీ జరగకుండా కట్టుదిట్టమైన చర్యలు చేస్తున్నారు. ఈ విషయమై అధికారులు తమ పనుల్లో నిమగ్నమయ్యారు.

● పోలీస్ యాక్ట్ అమలు

ఇంటర్ పరీక్షల సందర్భంగా మండలంలో పోలీస్ యాక్ట్ అమలవుతుందని ఎస్సై ప్రవీణ్ కుమార్ తెలిపారు. ఈ సందర్భంగా సోమవారం ఆయన మాట్లాడుతూ పరీక్షకేంద్రాల సమీపంలో ప్రజలు గుంపులుగా ఉండరాదని, ఈ సందర్భంగా 163 యాక్టు అమలు చేయడం జరుగుతుందన్నారు. అయితే పరీక్షలు ప్రారంభమైన నుంచి ముగిసే వరకు ప్రతిరోజు జిరాక్స్ సెంటర్లను మూసి ఉంచాలని పేర్కొన్నారు. ఈ విషయమై జిరాక్స్ సెంటర్ యజమానులకు నోటీసులు ఇచ్చినట్లు చెప్పారు. జిరాక్స్ సెంటర్లతోపాటు ఆన్‌లైన్ సర్వీస్ సెంటర్ సైతం మూసి ఉంచాలని అన్నారు. పట్టణ ప్రజలు సహకరించాలని కోరారు.



ముథోల్‌లో ఇంటర్ పరీక్షలకు సిద్ధం చేసిన ప్రభుత్వ జూ. కళాశాల



బోథ్‌లో పరీక్షలకు సిద్ధం చేసిన ప్రభుత్వ జూ. కళాశాల



రోడ్డుపై వాహనాల రాకపోకలతో వెలువడుతున్న దుమ్ము, ధూళి

దుమ్ముతో దమ్ము లేస్తోంది

● నత్తనడకన రెండు వరుసల రోడ్డు నిర్మాణ పనులు ● భారీ వాహనాల రాకపోకలతో వెలువడుతున్న దుమ్ము, ధూళి ● శ్వాసకోస సమస్యలతో బాధపడుతున్న స్థానిక ప్రజలు, ప్రయాణికులు ● పట్టించుకోని అధికారులు, కాంట్రాక్టర్

భీంపూర్, మార్చి3 (ఆంధ్రజ్యోతి): తాంసి మండలం పరిధిలోకి వచ్చే ఈదుల్ల సవర్గాం నుంచి భీంపూర్ మండలం నిపాని వరకు చేపడుతున్న రెండు వరుసల రోడ్డు నిర్మాణ పనుల వల్ల స్థానిక ప్రజలు శ్వాసకోస సమస్యలతో బాధపడుతున్నారు. ఈ రోడ్డు పనులు చాలా కాలంగా నత్తనడకన సాగుతున్నాయి. రోడ్డు పనుల్లో భాగంగా భారీ వాహనాల రాకపోకలతో వెలువడే దుమ్ము, దూళితో ప్రయాణికులు, స్థానిక ప్రజలు శ్వాసకోస సమస్యలతో బాధపడుతున్నట్లు చెప్తున్నారు. దుమ్ముతో దగ్గు, దుమ్ముతో ప్రయాణికులు వ్యాధుల బారిన పడుతున్నారు. అంతేకాకుండా భారీ వాహనాలు వెళ్లిన వెంటనే విపరీతంగా దుమ్ము లేస్తోంది. ఆ వాహనాలు వెనక ప్రయాణించే వారు దుమ్ముతో ఎదురుగా వస్తున్న వాహనాలు కూడా కనిపించని పరిస్థితి నెలకొంది. వాస్తవానికి రోడ్డు నిర్మాణ పనులు కొనసాగే సమయంలో సదరు కాంట్రాక్టర్ నీళ్ల ట్యాంకర్ ద్వారా చెల్లిస్తూ ఉండాలి. కానీ ఇక్కడ అవేమీ కనిపించడం లేదు. రోడ్డు నిర్మాణ పనుల్లో కనీస నిబంధనలు పాటించడం లేదు. భీంపూర్ మండలం పిప్పల్‌కోటి రోడ్డు సమీపంలో సోమవారం కనిపించిన దృశ్యాలివి.



కార్యక్రమంలో వీసీ, ప్రొఫెసర్లు, అధ్యాపకులు, సిబ్బంది

ఆర్జీయూకేటీలో ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ కార్యక్రమం

బాసర, మార్చి3: (ఆంధ్రజ్యోతి): బాసర ఆర్జీయూకేటీ ఈసీఈ డిపార్టుమెంట్ చండీగఢ్‌లోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నికల్ టీచర్స్ ట్రైనింగ్ అండ్ రీసెర్చ్ (ఎన్ఐటీటీటీఆర్) తో కలిసి ఉచిత సిమ్యులేటర్లను ఉపయోగించి ల్యాబ్ సబ్జెక్టులను బోధించడం అనే అంశంపై ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ ఏ. గోవర్ధన్ మాట్లాడుతూ ప్రయోగశాలలో ఉచిత సాఫ్ట్‌వేర్ ప్రాముఖ్యత, ప్రయోజనాలను నొక్కిచెప్పారు. ఓపెన్ సాఫ్ట్‌వేర్ కోసం ఒక ఫ్రేమ్ వర్క్‌ను రూపొందించడంలో ప్రపంచ సమాజాల పాత్రను హైలైట్ చేశారు. 5రోజుల వర్క్‌షాప్‌లో ఉచిత సిమ్యులేటర్లను ఉపయోగించి ఎలక్ట్రానిక్, కమ్యూనికేషన్ ఇంజనీరింగ్ ల్యాబ్ సబ్జెక్టులను సమర్థవంతంగా బోధించడానికి అవసరమైన నైపుణ్యాలు, జ్ఞానంతో ఫ్యాకల్టీ సభ్యులు, ల్యాబ్ సిబ్బందిని సన్నద్ధం చేయడం లక్ష్యంగా పెట్టుకుందని తెలిపారు. ఫ్యాకల్టీ, ల్యాబ్ సిబ్బందితో సహా ఇరవై ఐదు మంది హాజరయ్యారు. కార్యక్రమంలో ఏవో రణధీర్ సాగి, అసోసియేట్ డీన్ డాక్టర్ కే.మహేష్, ఈసీఈ విభాగం అధిపతి సాయి రాధాకృష్ణ, అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.





నిర్మల్ పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం ఇదే



ముథోల్ మండల కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం ఇదే



ఖానాపూర్‌లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం ఇదే

క్యాంపు కార్యాలయాలు ఖాళీ!

- సొంత ఇళ్లకే పరిమితం అవుతున్న ఎమ్మెల్యేలు
- క్యాంపు ఆఫీసుల్లో కానరాని కార్యకలాపాలు
- కోట్లాది రూపాయల నిధులతో నిర్మాణాలు
- భారమవుతున్న నెలవారీ ఖర్చులు

నిర్మల్, మార్చి 3 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని ముగ్గురు ఎమ్మెల్యేలు తమ నియోజకవర్గ కేంద్రాల్లో గల క్యాంపు కార్యాలయాలను నిర్లక్ష్యం చేస్తున్నారన్న ఆరోపణలున్నాయి. నిర్మల్, ఖానాపూర్, భైంసాలో గల క్యాంపు కార్యాలయాలను అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం ఒక్కో కార్యాలయానికి రూ.కోటికి పైగా వ్యయం చేసిన నిర్మించింది. దీంతో పాటు మరో 20 లక్షల వరకు ఖర్చు చేసి ఆ క్యాంపు కార్యాలయంలో ఫర్నీచర్‌ను కూడా ఏర్పాటు చేశారు. ఈ క్యాంపు ఆఫీసులో విశాలమైన గదులు, ఖాళీ ఆవరణ ఉండే ట్లు డిజైన్ చేశారు. అయితే ఈ క్యాంపు కారాల్యయాల భవనాలు వాస్తుకు అనుకూలంగా లేవన్న ప్రచా రం జరగడంతో అప్పటి బీఆర్ఎస్ మంత్రి, ఎమ్మె ల్యేలు కేవలం ఒకటి, రెండుసార్లు మాత్రమే ఈ క్యాంపు కార్యాలయానికి వచ్చి తమ కార్యకలాపాల్లో పాల్గొన్నారే తప్పా ఆ తరువాత ఇటువైపు కన్నెత్తి కూడా చూడలేదు. ఆర్ అండ్ బీ శాఖ ఆధ్వర్యంలో వీటిని భారీమొత్తంలో నిధులను వ్యయం చేసి నియోజకవర్గ ప్రజలకు అందుబాటులో ఉండే విధంగా నిర్మించారు. ప్రజల కోసం ఎమ్మెల్యేలు ఈ క్యాంపు ఆఫీసులోనే అందుబాటులో ఉండాలన్న లక్ష్యంతో వీటిని నిర్మించినప్పటికి ఆ లక్ష్యం మాత్రం దాదాపు ఐదేళ్ళు గడుస్తున్నప్పటికీ ఇప్పటి వరకు నెరవేరడం లేదు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం వీటిని ఆర్భాటంగా నిర్మించినప్పటికి ఈ క్యాంపు ఆఫీసుల వినియోగంపై మాత్రం అంతగా దృష్టి పెట్టలేదు. ఖానాపూర్, భైంసా క్యాంపు కార్యాలయాల్లో మాత్రం అప్పటి ఎమ్మెల్యేలు మీడియా సమావేశాలు ఏర్పా టు చేయడం, ఒకటికి రెండుసార్లు అధికారులతో సమీక్ష జరపడానికే పరిమితమయ్యారు. ఆ తరువాత క్యాంపు కార్యాలయంలో ఎలాంటి కార్యకలాపాలను చేపట్టలేదు. జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు ఆఫీసు దాదాపు ఏడాదిలో ఒకటి రెండుసార్లు మాత్రమే ఉపయోగించారు. ప్రతీరోజు ఈ క్యాంపు ఆఫీసులకు తాళాలే దర్శనమిస్తుంటాయి. ఎలాంటి కార్యకలాపాలు జరగకపోవడంతో స్థానిక ప్రజలు సైతం ఈ క్యాంపు ఆఫీసులను విస్మరించారు. వారంతా తమ పనుల కోసం ఎమ్మెల్యేల ఇళ్ళకు వెళ్లడమే సంప్రదాయంగా పెట్టుకుంటున్నారు. ఎమ్మెల్యేలు సైతం తమ ఇళ్ల నుంచే ప్రజలకు అందుబాటులో ఉంటుండడమే గాకుండా అధికారిక రాజకీయ కార్యకలాపాలను కూడా ఇళ్ల నుంచే నిర్వహిస్తున్నారు. దీంతో క్యాంపు కార్యాలయాలు ప్రస్తుతం ఉత్సవ విగ్రహాలుగా మారిపోయాయన్న ఆరోపణలు వస్తున్నాయి.

● ఆస్తి పన్ను, కరెంటు బిల్లుల భారం

నాలుగేళ్ల క్రితం నిర్మించిన ఎమ్మెల్యే క్యాంపు ఆఫీసుల భవనాలను పెద్దగా వినియోగించకపోతున్నప్పటికీ వాటికి సంబంధించిన ఆస్తిపన్ను, కరెంటు బిల్లులు మాత్రం సర్కారుకు భారమవుతున్నాయి. నిర్మల్‌లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయానికి ప్రతి యేటా 25,430 ఆస్తి పన్ను చెల్లించాల్సి వస్తోంది. గత నాలుగేళ్ళ నుంచి ఆర్ అండ్ బి శాఖ అధికారులు మున్సిపాలిటీకి ఈ ఆస్తి పన్ను చెల్లించారు. ఈ ఏడాది ఆస్తి పన్ను మాత్రమే బకాయిగా ఉంది. అలాగే భైంసా, ఖానాపూర్ క్యాంపు ఆఫీసులకు కూడా ఒక్కో భవనానికి దాదాపు 20వేలకు పైగా ఆస్తి పన్ను చెల్లించాల్సి ఉంది. కాగా ఈ క్యాంపు ఆఫీసు భవనాల్లో ఎలాంటి కార్యకలాపాలు లేకున్నప్పటికి ఆస్తి పన్ను, కరెంటు బిల్లుల చెల్లింపుతో పాటు ఇతర మరమత్తు ఖర్చులు మాత్రం చేయాల్సి ఉంటుంది. ఇటీవలే ఎన్నికలు పూర్తవడం, ప్రభుత్వం మారడంతో ఈ క్యాంపు ఆఫీసులకు ఆర్ అండ్ బి అధికారులు మరమత్తులు చేయడమే కాకుండా కొత్త రంగులు కూడా వేశారు. ఎమ్మెల్యేలు మాత్రం తాము బాధ్యతలు చేపట్టి ఏడాది గడుస్తున్నా క్యాంపు ఆఫీసుల వైపు పెద్దగా ఆసక్తి చూపకపోతుండడం చర్చనీయాంశంగా మారుతోంది.

క్యాంపు ఆఫీసులో అందుబాటులో ఉండాలి

ఎస్. విలాస్, సీపీఐ రాష్ట్ర కమిటీ నేత, నిర్మల్

కోట్ల రూపాయలతో నిర్మించిన ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయాల్లో ఎమ్మెల్యేలు అందుబాటులో ఉండాలి. ఎమ్మెల్యేలంతా తమ ఇళ్ల వద్ద కాకుండా క్యాంపు కార్యాలయంలోనే కార్యకలాపాలు కొనసాగించాలి. క్యాంపు ఆఫీసులు ప్రజలందరికీ అందుబాటులో ఉన్న కారణంగా వీటిని వినియోగించడం తప్పనిసరి చేయాలి. ప్రజలకు కూడా క్యాంపు క్యాంపు ఆఫీసులో అన్ని సౌకర్యాలు అందుబాటులో ఉంచాలి. ప్రభు త్వం క్యాంపు ఆఫీసుల కోసం పెద్ద మొత్తంలో ఖర్చు చేసినప్పటికీ వాటిని ఉపయోగించకపోవడం స మంజసం కాదు. పట్టణ నడిబొడ్డున క్యాంపు ఆఫీసులున్న కారణంగా అవి ప్రజలకు ఎంతో ఉపయోగపడతాయి.

ఘనంగా పెద్దమ్మ తల్లి ఆలయ వార్షికోత్సవం



పెద్దమ్మ తల్లి వార్షికోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం

ముథోల్, మార్చి 3 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని చించాల గ్రామంలో సోమవారం పెద్దమ్మ తల్లి ఆలయ మొదటి సంవత్సరం వార్షికోత్సవం ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో అంగరంగ వైభవంగా కన్నుల పండుగగా జరుపుకున్నారు. పూజారి శివ కుమార్ ఆధ్వర్యంలో అమ్మవారికి అభిషేకం, అర్చనలు, హారతి తదితర పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా అన్నదాన కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమంలో ముదిరాజ్ సంఘ సభ్యులు పెద్ద లస్మన్న, మైస లస్మన్న, ఒరగంటి పండరి, శివురాం, తునుకు హన్మాండ్లు, తానూర్ పండరి, ముత్తన్న, లక్ష్మీకాంత్, భైరోళ్ల నడిపి లస్మన్న, భైరోళ్ల చిన్న లస్మన్న, సాయన్న, ఈరన్న, సాయినాథ్, తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా శివపార్వతుల కల్యాణం

కుబీర్, మార్చి 3 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పార్డి(కే) రాజరాజేశ్వర ఆలయంలో శివపార్వతుల కళ్యాణం సోమవారం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉదయం ఆలయంలోని దేవతామూర్తులకు పంచామృత అభిషేకం రుద్రాభిషేకం, అర్చన, కార్యక్రమాలు నిర్వహించి ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన మండపంలో శివపార్వతుల కళ్యాణాన్ని ఘనంగా నిర్వహించారు. అనంతరం గ్రామస్తులు భక్తులు స్వామి వారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ నాయకులు ఎగ్గాం సాయినాథ్, గంగాధర్, వెంకటి, నాగేష్, శంకర్, దేవన్న, పుండ్లీక్, సాయిప్రసాద్, శ్రీధర్, నిరంజన్, తదితరులున్నారు.

లక్ష్మీ నరసింహస్వామి
ఆలయానికి మేళతాళాల వితరణ



మేళతాళాలను విరాళంగా అందజేస్తున్న దృశ్యం

సోన్, మార్చి 3 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలో ఇటీవల పునర్నిర్మితమైన లక్ష్మీ నరసింహస్వామి ఆలయానికి నిర్మల్ పట్టణానికి చెందిన ప్రముఖ వైద్యుడు రమేష్‌రెడ్డి సోమవారం మేళ తాళాలను విరాళంగా అందజేశారు. అనంతరం ఆలయంలో ప్రత్యేకపూజలను నిర్వహించారు. ఆలయ కమిటీ సభ్యులు ఆయనను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, తదితరులున్నారు.

ఉరి వేసుకొని ఒకరి ఆత్మహత్య



సంఘటన స్థలంలో ఆత్రం నైకు మృతదేహాన్ని పరిశీలిస్తున్న పోలీసు

కడెం, మార్చి 3 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ఉడుంపూర్ గ్రామశివారులో ఆదిలాబాద్ జిల్లా తిప్ప గ్రామానికి చెందిన ఆత్రం నైకు(24) అనే వ్యక్తి ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడు మద్యానికి బానిసై ఏ పని చేయకుండా రెండు నెలల నుంచి ఖాళీగా ఉంటున్నాడు. మద్యం తాగడానికి డబ్బులు అడుగగా డబ్బులు ఇవ్వకపోవడంతో బాధపడుతూ ఇంటి నుండి బయటకు వెళ్లిపోయి జీవితంపై విరక్తి చెందిన ఉడుంపూర్ గ్రామ శివారులోని అడవి ప్రాంతంలో చెట్టుకు ఉరివేసుకొని చనిపోయాడు. మృతుడి తండ్రి ఆత్రం రాము ఫిర్యాదు మేరకు కడెం ఎస్సై ఎం.కృష్ణసాగర్‌రెడ్డి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

ఇసుక అక్రమంగా తరలిస్తున్న
వ్యక్తిపై కేసు నమోదు



పట్టుబడిన ఇసుక ట్రాక్టర్

సోన్, మార్చి 3 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని గంజాల్ గ్రామ శివారులోని స్వర్ణవాగు నుండి నిర్మల్‌లోని ఖురాన్‌పేట్‌కు చెందిన ఈశ్వర్ అనే వ్యక్తి అక్రమంగా ఇసుకను తీస్తూ, ట్రాక్టర్ ద్వారా నిర్మల్‌కు తరలిస్తున్నాడు. ఈ ఇసుక లోడ్‌తో కూడిన ట్రాక్టర్‌ను నిర్మల్ అడిషనల్ ఎస్పీ రాజేష్ మీనా ఐపీఎస్, సోన్ సీఐ నవీన్ కుమార్, సోన్ ఎస్సై గోపి పట్టుకుని కేసు నమోదు చేశారు. ఇకపై ఎవరైనా కానీ ఇసుకను అక్రమంగా తరలించడం కానీ, ఇసుకను అక్రమంగా నిల్వ ఉంచడం కానీ చేసినచో వారి పైన కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.

గ్రామపంచాయతీ మోటారు చోరీ

కుంటాల, మార్చి, 3 : (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రం కుంటాల పంచాయతీ పరిధిలో గల సేవాలాల్ తాండా రోడ్డు పక్కన గ్రామపంచాయతీకి సంబంధించిన మోటారు ఆదివారం రాత్రి చోరీకి గురైనట్లు పంచాయతీ కార్యదర్శి రాజబాపు తెలిపారు. గ్రామంలో ప్రజలకు నీటి సరఫరాకు అవసరమయ్యే మోటారు చోరీకి గురైందని, మోటారు విలువ రూ. 20 వేల వరకు ఉంటుందని ఆయన పేర్కొన్నారు. ఈ మేరకు కుంటాల పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశామని తెలిపారు.

యాసంగి పంటలకు
సాగునీటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు చేపట్టాలి

● రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి



వీడియో కాన్ఫరెన్స్‌లో శాంతి కుమారితో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్

నిర్మల్ అర్బన్, మార్చి 3 (ఆంధ్రజ్యోతి) : యాసంగిలో పంటలకు సాగునీటితో ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు చేపట్టాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి అధికారులను ఆదేశించారు. సోమవారం సాయంత్రం హైదరాబాద్ సచివాలయం నుంచి యాసంగిలో సాగునీరు, వసతి గృహాల తనిఖీ, సింగిల్ యూసేజ్ ప్లాస్టిక్ నిషేధం, తదితర అంశాలపై జిల్లాల కలెక్టర్లతో ఆమె వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా సీఎస్ మాట్లాడుతూ.. యాసంగిలో సాగునీటి సమస్య లేకుండా ప్రాజెక్టులు, చెరువులపై సమీక్షించి ముందస్తు చర్యలు చేపట్టాలని తెలిపారు. జిల్లాల వారీగా సాగు చేస్తున్న పంటల విస్తీర్ణానికి సంబంధించి వివరాలను కలెక్టర్లను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వ వసతి గృహాలను జిల్లా అధికారులు ఎప్పటికప్పుడు సందర్శించి పాఠశాలలో నెలకొన్న సమస్యలను గుర్తించి వెంటనే పరిష్కరించే విధంగా చర్యలు చేపట్టాలని తెలిపారు. గ్రామ, మండల స్థాయి కార్యాలయాల్లో మొదలుకొని, జిల్లా స్థాయి కార్యాలయాల్లో సింగిల్ యూస్ ప్లాస్టిక్ వాడకాన్ని పూర్తిగా నిషేధించాలని ఆదేశించారు. కలెక్టరేట్ నుంచి జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ మాట్లాడుతూ... వేసవిలో పంటలకు సాగు నీటిని అందించే విధంగా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. బోరు బావుల ఆధారిత పంట పొలాల రైతులకు నిరంతరంగా విద్యుత్ సరఫరా చేసే విధంగా ఇప్పటికే అధికారులతో సమావేశం నిర్వహించి తగు ఆదేశాలు జారీ చేసినట్లు తెలిపారు. జిల్లాలోని 57 ప్రభుత్వ వసతి గృహాలలో ఇప్పటికే అదనపు కలెక్టర్‌తో కలిసి పలు వసతి గృహాలను తనిఖీ చేసినట్లు తెలిపారు. ఈ తనిఖీల్లో భాగంగా ప్రభుత్వ వసతి గృహాల్లో గుర్తించిన చిన్న చిన్న సమస్యలను వెంటనే పరిష్కరించినట్లు తెలిపారు. వసతి గృహాలకు ప్రత్యేక అధికారులను నియమించి వారానికి రెండు సార్లు విద్యార్థులతో కలిసి భోజనం చేసే విధంగా చర్యలు చేపట్టినట్లు తెలిపారు. వసతి గృహాల్లో బాలశక్తి కార్యక్రమంలో భాగంగా విద్యార్థులందరికీ పలు వైద్య పరీక్షలు నిర్వహించినట్లు తెలిపారు. సింగిల్ యూసేజ్ ప్లాస్టిక్ నిషేధానికి చర్యలు చేపట్టామన్నారు. పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో వేసవి కాలంలో త్రాగునీటి సమస్యలు తలెత్తకుండా నివారించేందుకు చర్యలు చేపడుతున్నామని తెలిపారు. నీటి కొరత ఉన్న ప్రాంతాల ప్రజలకు ట్యాంకర్ల ద్వారా తాగు నీటి సరఫరా చేసేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. నీటి వనరులను శుభ్రంగా ఉంచడం, నీటివృధాను నివారించడం, ప్రజలకు నీటి సంరక్షణపై అవగాహన కల్పిస్తున్నామని వివరించారు. వేసవికాలంలో సాగు, తాగునీటి సమస్యల పరిష్కారానికి జిల్లా ప్రజలు కలెక్టరేట్ కంట్రోల్ రూమ్‌నెంబర్ 6305646600 సంప్రదించాలని, అలగే మండల స్థాయిలో తహసీల్దార్ కార్యాలయాల్లో సంప్రదించాలని కలెక్టర్ సూచించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్, జడ్పీ సీఈవో గోవింద్, డీపీవో శ్రీనివాస్, వ్యవసాయ అధికారి అంజిప్రసాద్, ఇరిగేషన్ ఎస్ఈ రవీందర్, ఇతర అధికారులను, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

బాలికలు అన్ని రంగాల్లో రాణించాలి

● అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్

నిర్మల్ కల్చరల్, మార్చి 3 (ఆంధ్రజ్యోతి) : బాలికలు అన్ని రంగాల్లో రాణించి ఉన్నత స్థానానికి ఎదగాలని అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్ పిలుపునిచ్చారు. సోమవారం బేటీ బచావో - బేటీ పడావో కార్యక్రమం పది సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా డిగ్రీ కళాశాల విద్యార్థులతో సమావేశమయ్యారు. గ్రామ స్థాయి నుండి జిల్లా స్థాయి వరకు పరిపాలన విధానం, భవిష్యత్ ప్రణాళిక, మహిళా సాధికారత, తదితర అంశాలపై చర్చించారు. శిశు సంక్షేమ శాఖ అధికారులు నాగలక్ష్మి, సవిత, మిషన్ శక్తి బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

శిక్షణ అంశాలు సద్వినియోగం చేసుకోవాలి

● జిల్లా విద్యాధికారి రామారావు



సమావేశంలో మాట్లాడుతున్న డీఈవో రామారావు

నిర్మల్ కల్చరల్, మార్చి 3 (ఆంధ్రజ్యోతి) : ఉపాధ్యాయులు శిక్షణలో నేర్చుకున్న అంశాలు బోధనలో అన్వయించి సద్వినియోగం చేసుకోవాలని డీఈవో రామారావు అన్నారు. మూడు రోజులపాటు ఎస్టీటీ ఉపాధ్యాయులకు నిర్వహించిన శిక్షణ సోమవారం ముగిసింది. కస్బా హైస్కూల్, పంచశీల్ శిక్షణ కేంద్రాలను సందర్శించారు. మెరుగైన విద్యా బోధనకు, నైపుణ్యాలు పెంపొందించేందుకు శిక్షణ దోహదం చేస్తుందన్నారు. ఏఎంవో నర్సయ్య, కోర్స్ డైరెక్టర్ విజయ్ కుమార్, అశోక్ కుమార్, ఉపాధ్యాయులు, ఆర్పీలు పాల్గొన్నారు.

బాలికలకు పోటీల నిర్వహణ

బేటీబచావో - బేటీపడావో కార్యక్రమంలో భాగంగా జిల్లాలోని పాఠశాలల్లో చదువుతున్న 8, 9 బాలికలకు వ్యాసరచన, చిత్రలేఖనం పోటీలు నిర్వహించనున్నట్టు డీఈవో రామారావు ఒక ప్రకటనలో తెలిపారు. అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్ ఆదేశం మేరకు 4న పాఠశాల, 5న మండల, 6న జిల్లా స్థాయి పోటీలుంటాయని పేర్కొన్నారు. జిల్లా స్థాయి పోటీలు ప్రియదర్శిని నగర్ ఎన్టీఆర్ మినీ స్టేడియంలో ఉదయం 11 గంటలకు నిర్వహిస్తారని తెలిపారు. ఈ నెల 8 మహిళా దినోత్సవం నాడు కలెక్టర్ చేతుల మీదుగా విజేతలకు బహుమతులు అందజేస్తారని వివరించారు. ఈ మేరకు చర్యలు తీసుకోవాలని ప్రధానోపాధ్యాయులను, ఎంఈవోలను కోరారు.

జాతీయ లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోండి

● ఎస్పీ జానకీ షర్మిల



ఎస్పీ జానకీ షర్మిల

నిర్మల్ కల్చరల్, మార్చి 3 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో నిర్వహించే జాతీయ లోక్ అదాలత్‌లను సద్వినియోగం చేసుకోవాలని ఎస్పీ జానకి షర్మిల కోరారు. సోమవారం విడుదల చేసిన ప్రకటనలో ఉచిత న్యాయ సేవా సంస్థ ఆధ్వర్యంలో మార్చి 8 వరకు నిర్మల్ పట్టణం, భైంసా, ఖానాపూర్ కోర్టులలో జాతీయ లోక్ అదాలత్ నిర్వహిస్తారని తెలిపారు. జిల్లాలో వివిధ రకాల రాజీపడదగిన కేసుల్లో ఉన్న కక్షిదారులకు మంచి అవకాశమన్నారు. రోడ్డు ప్రమాదాలు, మోసం(చీటింగ్), కొట్లాటలు, వివాహ బంధం, చిన్న దొంగతనాలు, డ్రంగ్ అండ్ డ్రైవ్, తదితర రాజీపడదగిన కేసులకు పరిష్కారం లభిస్తుందని వివరించారు. ఫిర్యాదుదారుడు, నిందితుడు కోర్టుకు హాజరు కావాలని సూచించారు. ఆధార్ కార్డు వెంట తీసుకొని సంబంధిత కోర్టు ప్రదేశాలకు రావాలన్నారు. లోక్ అదాలత్ ద్వారా పరిష్కరించుకుంటే లీగల్ ఫీజులు, కోర్టు ఖర్చులు తగ్గుతాయని తెలిపారు. కోర్టులకు ప్రతీరోజు తిరగాల్సిన అవసరం ఉండకుండా ఒకేరోజు సమస్యలు పరిష్కరించుకునే వీలుంటుందన్నారు. న్యాయపరమైన చిక్కుల నుంచి విముక్తి లభిస్తుందని స్పష్టం చేశారు.

బాధిత కుటుంబానికి మాజీ మంత్రి పరామర్శ



బాధిత కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న మాజీ మంత్రి చారి

ముథోల్, మార్చి 3 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రమైన ముథోల్‌కు చెందిన మున్నూరు కాపు సంఘం ముథోల్ తాలూకా అధ్యక్షులు రోళ్ల రమేష్ తల్లి అనారోగ్యంతో శనివారం మృతి చెందింది. అయితే ఈ విషయం తెలుసుకున్న మాజీమంత్రి సముద్రాల వేణుగోపాల చారి సోమవారం వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈయన వెంట నాయకులు ధర్మ గౌడ్, దిగంబర్, అజీజ్, శంకర్, తదితరులున్నారు.

విత్తనోత్పత్తిపై రైతులకు శిక్షణ

ముథోల్, మార్చి 3 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రమైన ముథోల్‌లోని వ్యవసాయ పరిశోధన స్థానం, ఏరువాక కేంద్రంలో సోమవారం రైతులకు శాస్త్రవేత్తలు విత్తన ఉత్పత్తిపై శిక్షణను ఇచ్చారు. విత్తన, పరిశోధన, సాంకేతిక కేంద్రం రాజేంద్ర నగర్ హైదరాబాద్‌కు చెందిన శాస్త్రవేత్తలు డా. ప్రభావతి, డా. సుకుమార్, డా. స్వర్ణలత, ముథోల్ ఏరువాక కేంద్రం ప్రధాన శాస్త్రవేత్త డా. నర్సయ్య, డా. విజయ్ కుమార్, డా. కార్తీక్‌లు వివిధ పంటల విత్తనోత్పత్తుల గురించి వివరించారు. పలు పంటలపై సలహాలు, సూచనలు ఇచ్చారు.